## డంపింగ్ యార్డును రద్దు చేయాలి



రిలేనిరాహారదీక్ష చేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

నర్సాపూర్, మార్చి 23: ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డును తక్షణమే రద్దు చేయాలని ఆర్యవైశ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో నర్సాపూర్‌కు చెందిన ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. డంపింగ్‌యార్డుతో గాలి, నీరు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌గుప్తా, ఇమ్మడి శ్రీనివాస్‌గుప్తా, మల్లేశం, రాఘవులు, శివశంకర్, రాము, సుధాకర్, భైరవగుప్తా, శ్రీనివాస్‌గుప్తా, రాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభం నిర్మాణానికి విరాళం



చిన్నశంకరంపేటలో విరాళాలు అందిస్తున్న దాతలు

చిన్నశంకరంపేట, మార్చి 23: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయంలో ధ్వజస్తంభం నిర్మాణానికి మేడి లక్ష్మీబాలపోచయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు మేడిశ్రీమాన్, మురళి బాలకృష్ణలు ఆదివారం రూ.3.16లక్షల విరాళాన్ని అందించారు. ఎన్‌ఆర్‌ఐ కంజర్ల చంద్రశేఖర్ పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి 200 బస్తాల సిమెంట్‌ను అందించారు.

## గ్రామాభివృద్ధిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల పాత్ర ఎనలేనిది

నర్సాపూర్, మార్చి 23: గ్రాయిభివృద్ధిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల పాత్ర ఎనలేనిదని ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ లైజర్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవ పథకం (ఎన్‌ఎస్‌ఎస్) యూనిట్-1 మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ లైజర్ అధికారి డాక్టర్ భాస్కర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక, సాంస్కృతిక జీవన విధానాన్ని, మౌలిక వనరులను, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుదరరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డా.సురేశ్‌కుమార్, పీఆర్‌వో అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు మహేందర్‌రెడ్డి, రాజు, రాము, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మా రోడ్డు మాకే దక్కాలని కాలనీవాసుల నిరసన



కేసీఆర్ కమాన్ వద్ద నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

రామాయంపేట, మార్చి 23: తమ కాలనీకి మంజూరైన రోడ్డు తమకే దక్కాలని కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూమ్ నివాసులు ఆదివారం కమాన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ కాలనీ సంఘం గౌరవాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో దవాఖాన నుంచి కేసీఆర్ కాలనీ వరకు రూ.కోటితో బీటీ రోడ్డు మంజూరైందన్నారు. మూడో వార్డుకు చెందిన కొంతమంది రోడ్డు పనులకు అడ్డుపడుతున్నారని, ఇది సరికాదని అన్నారు. అక్కడికి వెళ్లిన కేసీఆర్ కాలనీవాసులతో మూడో వార్డు ప్రజలు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు ఇరు కాలనీవాసులను శాంతింపజేశారు. నిరసనలో ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, పీఆర్‌వో లద్ద నర్సింహులు, ఎల్లాగౌడ్, కాసర్ల రమేశ్, ఎరుకల నర్సింహులు, చంద్రం, రవి, చాంద్‌పాష, బాబు, మంజుల, మాధవి, నర్సమ్మ, చంద్రకళ, శ్రీనివాస్, మౌసాగౌడ్, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కౌడిపల్లి, మార్చి 23: మండలంలోని మహమ్మద్‌నగర్‌కు చెందిన కమ్మరి శ్రీనివాస్ శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో1999-2000లో పదో తరగతి చదివాడు. ఆయనతో చదువుకున్న తోటి విద్యార్థులు మృతుడి అంత్యక్రియలకు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

## హైదరాబాద్‌పై మెదక్ క్రికెట్ టీం విజయం

మెదక్ అర్బన్, మార్చి 23: సత్యసాయి సేవా సమితి శివం హైదరాబాద్ ఆధ్వర్యంలో చెంగిచెర్ల స్టేడియంలో ఎస్‌ఎస్‌ఎస్‌ఎన్‌సీఎల్ యూనిటీ కప్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో మెదక్ క్రికెట్ టీం 66 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు మెదక్ సత్యసాయి అధ్యక్షుడు ప్రభాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. టీం విజయంలో పాల్గొన్న పీడీ మాధవరెడ్డి, పీడీ దేవేందర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఆ దారిలో ప్రయాణం నరకప్రాయం







వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారిపై ఉన్న గోతులు, ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

- రోడ్డంతా గుంతలమయం
- వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారి
- రెండు లేన్ల రోడ్డు నిర్మాణానికి డిమాండ్

వెల్దుర్తి, మార్చి 23: వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో జిల్లా కార్యాలయాలు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే ప్రజలతో పాటు ఉద్యోగస్తులు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెల్దుర్తి నుంచి ఉప్పులింగాపూర్, రామాయిపల్లి, బండపోసాన్‌పల్లి, శెట్‌పల్లితో పాటు మెదక్ మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామాల మీదుగా పిల్లికొట్టాల వద్ద మెదక్- చేగంట ప్రధాన రహదారికి కలుస్తుంది. జిల్లా కార్యాలయాలకు మండల అధికారులతో పాటు సాధారణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యక్తిగత పనుల నిమిత్తం వందలాది మంది ప్రజలు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణాలు సాగిస్తుంటారు. వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు ఉన్న రోడ్డులో పెద్ద పెద్ద గోతులు, చిన్న కాల్వలతో పాటు రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయి కయ్యలు కోసి ప్రమాదకరంగా ఉంది. ప్రమాదకరమైన రోడ్డు వెంట ప్రయాణిస్తున్న ప్రజలు ఎన్నో ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఉదయం, సాయంత్రం వచ్చి పోయే బస్సుతో పాటు ఆటోలు, కొంతమంది ద్విచక్ర వాహనదారులు మాత్రమే ఈ రోడ్డు వెంట ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కొంత మంది ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లలో వెళ్లే వారు దూరభారమైన ఉప్పులింగాపూర్, గవ్వలపల్లి గ్రామాల మీదుగా మెదక్‌కు వెళ్తున్నారు. ఎన్నో ఏండ్ల నుంచి రోడ్డును నిర్మించి ప్రయాణ వేతలు తీర్చాలని మండల ప్రజలు, నాయకులు కోరుతునన్నా రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. ప్రభుత్వం స్పందించి వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిని రెండు వరుసల రోడ్డుగా నిర్మించాలని కోరుతున్నారు. బండపోస్‌పల్లి- ఏదులపల్లి-ఉప్పులింగాపూర్ గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సూచిక బోర్డులు లేకుండా ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

# సిల్వర్‌జూబ్లీ వేడుకలకు మాజీ మంత్రి హరీశ్‌రావు

శివ్వంపేట, మార్చి 23: బీఆర్‌ఎస్ శివ్వంపేట మండలాధ్యక్షుడు రాజా రమణాగౌడ్ దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ సిల్వర్‌జూబ్లీ వేడుకలు, నూతన గృహప్రవేశానికి ప్రముఖులు వచ్చి ఆశీర్వదించారు. దంపతులను ఆశీర్వదించిన వారిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.





బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్ గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## పంట నష్టపరిహారం ప్రకటించాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 23: జిల్లాలో ఎండిపోతున్న పంటలతో పాటు అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలతో బోర్ల నుంచి నీరు సరిగా రాకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండుతున్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో చేతికొచ్చిన పంటలు అకాల వర్షాలతో నష్టం జరిగిందన్నారు. పంటలకు ప్రభుత్వం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు కేటాయించడంతో చాలామంది నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ చివరి వరకు సమయం పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు మల్లేశం, మహేందర్‌రెడ్డి, నాగరాజు, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కౌడిపల్లి, మార్చి23: వెల్మకన్న జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో1987-88లో పదో తరగతిలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం వెల్మకన్న పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. 50 ఏండ్ల తర్వాత చదువుకున్న దోస్తులంతా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాములు, శర్మ, లక్ష్మయ్య, పోచయ్య, నరేశ్, కశీనాథం, సామెల్‌కు సన్మానించారు. కార్యక్రమానికి మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, మాజీ సర్పంచి రాజేందర్, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ సన్మానించారు. పూర్వవిద్యార్థులు శ్రీధర్, శ్రీహరి, సుకుమార్, రమేశ్, బాల్‌సింగ్, రఫీయోద్దీన్, పద్మారావు, బాలయ్య, నాగమణి, శైలజ, ఇందిర, యశోద, భూలక్ష్మి ఉన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

పాపన్నపేట,మార్చి 23: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన పాపన్నపేటలో జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు.. బట్టి బాలయ్య(60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం కౌలు చేస్తున్న పొలంలోని బోరు మోటారుకు సంబంధించిన స్టాటర్ చెడి పోవడంతో దాన్ని మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కిష్టవ్వ, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు.

## మెదక్ బస్టాండ్‌లో మెరుగైన వసతుల కల్పన: కలెక్టర్

మెదక్ అర్బన్, మార్చి 23: మెదక్ బస్టాండ్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. మెదక్ బస్టాండ్‌ను కలియ తిరిగి ప్రయాణికుల కోసం కల్పించిన వసతుల గురించి డీఎం సురేఖను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ శుభ్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లను ఆధునికరించి బస్టాండ్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ మహాలక్ష్మి పథకం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామాయంపేట బస్టాండ్‌కు సైకిల్‌పై బయలుదేరారు.



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## ఏసయ్య నామస్మరణతో హోరెత్తిన మెదక్ చర్చి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 23: మెదక్ చర్చి ఏసయ్య నామస్మరణతో ఆదివారం హోరెత్తింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటకోసారి జరిగే ప్రత్యేక ప్రార్థనలో భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్ ఆశీర్వదించారు. ఫీల్‌గ్రీమ్ మేనేజర్ జాయ్‌ముర్రే ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. కార్యక్రమంలో గంట సంపత్, సువణ్ డగ్లస్, జాన్సన్, సంశాన్‌సందీప్ పాల్గొన్నారు.



శిలువను ఊరేగింపు చర్చిలోకి తీసుకెళ్తున్న పాస్టర్లు

## యోగా అవార్డు గ్రహీత రామచంద్రం ఇకలేరు

చేగుంట, మార్చి 23: రాష్ట్రపతి యోగా అవార్డు గ్రహీత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వంజరి రామచంద్రం చేగుంటలో శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. రామచంద్రం మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు సంతానం వ్యక్తం చేశారు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన వంజరి రామచంద్రం(65)1980లో చేగుంట, భీంరావ్ పల్లి, ఎదుల్లాపూర్, తూప్రాన్‌లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. చేగుంటలో స్థిరపడ్డారు. ఎంతో మందికి యోగా నేర్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉండి మండల స్థాయి మొదలుకొని జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో తన యోగా విద్యను ప్రదర్శించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ద్వారా 2003లో యోగా అవార్డును అందుకున్నారు .యోగా గురువు రామచంద్రం మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా నాయకుడు రంగయ్యాగారి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, యోగా కోచ్ గణేశ్ రవికుమార్,జీవన్‌మంత్ర యోగా వ్యవస్థాపకుడు అల్లి నరేశ్, అయిత చంద్రమౌళి, పరంజ్యోతి సంతాపం వ్యక్తం చేశారు.





యోగా రామచంద్రంకు అవార్డు అందజేస్తున్న అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం (ఫైల్)

## అమరవీరుడు భగత్‌సింగ్ ఘన నివాళి



మెదక్ మున్సిపాలిటీ, మార్చి 23: దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులో ఉరి కంభాన్ని ముద్దాడి అమరులు, విప్లవ కె రటాలు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్‌గురు, సు ఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో మెదక్‌లోని పోస్టాఫీస్ చౌరస్తాలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి, దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, బాలమణి, నాగరాజు, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు వినూత్న ప్రచారం

రామాయంపేట, మార్చి 23: పర్యావరణ పరి రక్షణ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నారు. లక్ష్మాపూర్‌కు చెందిన డాక్టర్ రాగుల సుధాకర్ మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. గత రెండేండ్లుగా పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో నివసించే వారు సైకిళ్ల వాడకంతో పర్యావరణాన్ని కాపాడడటంతో పాటు ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుందన్నారు.



## నీట మునిగి బాలుడి మృతి

పాపన్నపేట, మార్చి 23: ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లంపేటలో జరిగింది. మల్లంపేటకు గ్రామానికి చెందిన కురుమ దుర్గయ్య (12) శనివారం రెడ్ల చెరువులోకి ఈతకని వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఆదివారం శవమై నీటిపై తేలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి

పాపన్నపేట, మార్చి 23: ఏడుపాయల వన దుర్గాభవానీ మాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. మంజీరాలోని వివిధ పాయల్లో స్నానాలాచరించి భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు.



## ప్రపంచానికి అనుగుణంగా నేర్చుకోవాలి

నర్సాపూర్, మార్చి 23: మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి నేర్చుకోవాలని ఐఅండ్‌సీ, ఐటీ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో బీవీఆర్‌ఐటీతో పాటు సెంటిల్ రిక్ గార్డ్, ఎస్-మాచ్‌ల సహకారంతో మెంటోరాక్స్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జయేశ్ రంజన్, టీ-హబ్ మాజీ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు హాజరయ్యారు. విద్యార్థులకు ఇంటర్‌ప్రిన్యూర్‌షిప్, ఏఐఎంఎల్, ఆర్‌అండ్‌డీ ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తూ ప్రారంభమైంది. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ మెంటోరాక్స్ ప్రోగ్రామ్ భవిష్యత్తు వ్యాపారవేత్తల ఆవిష్కరణలను ప్రేరేపిస్తుందన్నారు. టీ-హబ్ మాజీ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంప్రదాయ ఉద్యోగ అవకాశాలకు మించి నిజజీవిత సమస్యలకు పరిష్కారం రూపొందించడంపై దృష్టి పెట్టాలన్నారు. స్టార్టప్‌లో గెలుపు కోసం కొత్త మార్గాలను అన్వేషించడం కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, మాచ్ సీఈవో రాహుల్ పైత్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటులో మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నేత మృతి



ఎల్లారెడ్డి (ఫైల్)

రామాయంపేట, మార్చి 23: రాయిలాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చెందిన సీతగారి ఎల్లారెడ్డి(68) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు. హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్ద ఉన్న ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబీకులు దవాఖానకు తీసుకెళ్లేలోపే మధ్యలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఎల్లారెడ్డి ఉమ్మడి రామాయంపేట మండలం రాయిలాపూర్ సర్పంచ్‌గా రెండుసార్లు సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలిచారు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఉమ్మడి మండలాల సర్పంచ్‌లు, భూమగారి నర్సాగౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి అంత్యక్రియలకు వెళ్లి సంతాపం తెలిపారు.

## కోమటిపల్లి రైతు అదృశ్యం



నాగమల్లయ్య

రామాయంపేట, మార్చి 23: మండలంలోని కోమటిపల్లికి చెందిన రైతు నాగమల్లయ్య అదృశ్యమైన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమల్లయ్య (37)రైతు. 21న తన పొలానికి వెళ్లివచ్చాడు. రాత్రి అన్నం తిని పడుకున్నాడు. పొద్దున లేచి చూసేసరికి కనిపించలేదు. దీంతో కుటుంబీకులు ఆందోళన చెంది బంధువులు, ఇతరుల వద్ద ఆచూకీ కోసం వెతికారు. లభించలేదు. దీంతో శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగమల్లయ్య భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

## యువకుడు అదృశ్యం



పృథ్వీరాజ్

మనోహరాబాద్, మార్చి 23: యువకుడు అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూచారంలో నివసిస్తున్న పృథ్వీరాజ్ ఈ నెల 20న స్నేహితుడి పుట్టిన రోజుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛ్ ఆఫ్ రావడంతో బంధువులు, స్నేహితులు ఇంట్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మనోహరాబాద్ పోలీసులకు యువకుడి తండ్రి సుబ్బారావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



విద్యుత్ తీగలను చూపుతున్న ఇంటి యజమాని

చిలిపిచెడ్, మార్చి 23: గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే స్థితిలో ఉండడంతో ప్రజలు, రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. కరెంట్ తీగలు ఎప్పుడు తెగి మీదపడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. కరెంట్ సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. మండలంలోని చిట్కుల్‌లో బోయిని ఆంజనేయులు, గౌండ్ల విఠల్ గౌడ్ ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. కొంతమంది పొలాల్లో భూమిని తాకేలా విద్యుతు తీగలు ఉన్నాయి. ఈ తీగలను సరిచేయాలని ఎన్నిసార్లు అధికారులకు దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదు. ఇప్పుటికైన విద్యుత్ అధికారులు స్పందించి పొలాల్లో ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సైబర్ క్రైంపై కళాజాత

నిజాంపేట, మార్చి 23: నిజాంపేటలోని గాంధీ విగ్రహం వద్ద మేలుకొలుపు పోలీస్ కళాబృందం సభ్యులు సైబర్ క్రైంపై శనివారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్‌ను ఎవరికీ చెప్పకూడదని, ఫోన్‌కు వచ్చే అనవసరపు లింకులను క్లిక్ చెయొద్దని తెలిపారు. లాటరీ ప్రైజ్ మనీ వచ్చిందని కొంత నగదును జమ చేసినట్లైతే పెద్ద మొత్తంలో నగదును మీ బ్యాంకు అకౌంట్‌కు పంపిస్తామని సైబర్ నేరాగాళ్లు చెప్పే మాయమాటలు నమ్మరాదన్నారు. మేలుకొలుపు పోలీస్ కళాబృందం సభ్యులు ఉన్నారు.

## పార్కింగ్ చేసిన ట్రాక్టర్ చోరీ

తూప్రాన్, మార్చి 23: ఇంటి ముందు పార్కు చేసిన ట్రాక్టర్‌ను దుండగులు అపహరించిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన రాజేశ్వర్‌శర్మ తన ట్రాక్టర్ టీఎస్ 35డీ 4688ను పనుల తర్వాత శనివారం ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఆదివారం చూసే సరికి ట్రాక్టర్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలిగా సంతోష



సంతోష



సంగమేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 23: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సంతోష, సంగమేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కిషన్, శ్రీనివాస్, ఎర్రదాస్, లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా భిక్షపతి, వినయ్ ఎన్నుకున్నారు.

## ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 23: శాలివాహన చక్రవర్తి జయంతి పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో పట్టణ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నాయకులు అంజయ్య, రాములు, సిద్దయ్య, కిరణ్, రాజేశ్, మనోజ్, మానస, మమత, స్వరూప, హేమలత ఉన్నారు.